



EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శుక్రవారం
03 మే 2024
పేజీలు: 02



## ఎట్టకేలకు శంషాబాద్ విమానాశ్రయంలో చిక్కిన చిరుత

ఎట్టకేలకు శంషాబాద్ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన బోనులో చిరుత చిక్కింది. ఐదు రోజులుగా చిరుత కోసం అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. దీన్ని పట్టుకోవడానికి ఐదు బోన్లు, 20 కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ చిరుతను నెహ్రూ జూ పార్కుకు తరలించనున్నారు. జూలో చిరుత ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌కు తరలించనున్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

## ఆయుర్వేదిక్ ఐస్‌క్రీమ్



ఎలాంటి రసాయనాలు లేకుండా, ప్రిజర్వేటివ్స్ వాడకుండా తయారుచేసిన ఆయుర్వేదిక్ ఐస్‌క్రీమ్ తనను టేస్ట్ చేయమంటూ చల్లగా ఆహ్వానిస్తున్నది. కానీ, దాన్ని టేస్ట్ చేయాలంటే అమెరికాలోని న్యూయార్క్ వరకూ వెళ్లాల్సిందే! అక్కడి ఇండియన్ రెస్టారెంట్‌లో ఈ ఆయుర్వేదిక్ ఐస్‌క్రీమ్ అందుబాటులో ఉంది. హ్యాండ్‌మేడ్ స్పెషల్ ఐస్‌క్రీమ్ పసుపు వన్నెలో చవులూరిస్తుంటుంది. రకరకాల ఆయుర్వేద మూలికలతో దీనిని తీర్చిదిద్దారు. పలురకాల ఫ్లేవర్లు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ స్పెషల్ ఐస్‌క్రీమ్ పుట్టి నాలుగైదేండ్లు గడుస్తున్నా.. మళ్లీ వేసవి రావడంతో దీని ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ఈ హెల్దీ ఐస్‌క్రీమ్ మనదగ్గరికీ రావాలని కోరుకుందాం. అప్పటిదాకా.. మన జంధ్యాలవారి పీనాసి లక్ష్మీపతిని ఆదర్శంగా తీసుకొని, ఆ ఐస్‌ఫ్రూట్ చిత్తరువు వంక తీక్షణంగా చూస్తూ సాదాసీదా ఫుల్లైస్ చప్పరించడమే మనం చేయగలిగింది!



## లైంగిక వేధింపుల కేసులో బెంగాల్ గవర్నర్

పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద బోస్‌పై ఓ మహిళ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసింది. గవర్నర్‌పై తమకు ఫిర్యాదు అందిందని డీసీ (సెంట్రల్) ఇందిరా ముఖర్జీ గురువారం నాడు పేర్కొన్నారు. అయితే, రాజ్‌భవన్‌లో పని చేస్తున్న ఓ మహిళ గవర్నర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతలు పేర్కొన్నారు. సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నాం.. లైంగిక వేధింపులు ఎప్పుడు వెలుగు చూశాయనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. కానీ, కంప్లైంట్ ప్రకారం, రాజ్‌భవన్‌లోనే పలు మార్లు లైంగిక వేధింపులకు గురైనట్టు సదరు మహిళ ఫిర్యాదు చేసిందని డీసీ పేర్కొన్నారు. కాగా, బెంగాల్ లోని రాజ్‌భవన్‌లో లైంగిక వేధింపుల ఘటనకు సంబంధించి సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. తనలాగే అనేక మంది బాధితులు ఉన్నారని ఓ మహిళ ఆరోపణలు చేసింది. మహిళల గౌరవమర్యాదలపై మోడీ, అమిత్ షాలకు నిజంగా నమ్మకం ఉంటే వెంటనే బాధితురాలికి న్యాయం చేయాలని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేసింది. అయితే, ఈ ఆరోపణలను పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ కొట్టి పారేశారు. అవన్నీ తప్పుడు ఆరోపణలు.. తన పరువుకు భంగం కలిగించేందుకు కుట్ర జరుగుతుందన్నారు. ఇలాంటి కల్పిత ఆరోపణలకు నేను భయపడేది లేదు.. నా పరువు తీసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని కొందరు చూస్తున్నారు.. కానీ, బెంగాల్‌లో అవినీతి, హింసపై నా పోరాటాన్ని ఎవరు ఆపలేరని గవర్నర్ బోస్ చెప్పుకొచ్చారు. ఈ విషయంపై రాజ్‌భవన్ సిబ్బంది ఆయనకు సపోర్టుగా నిలిచారు. ఆయనపై ఆరోపణలను ఖండిస్తూ వారు సంఘీభావం తెలిపారు.





### అమేఠీ నుంచి కిశోరీ లాల్

# రాయ్‌బరేలీ బరిలో రాహుల్ గాంధీ

ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేఠీ, రాయ్‌బరేలీ స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. రాయ్‌బరేలీ నుంచి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ బరిలోకి దిగుతున్నట్లు ఏఐసీసీ శుక్రవారం ప్రకటించింది. మరోవైపు అమేఠీ నుంచి కిశోరీ లాల్ శర్మను రంగంలోకి దించింది. ఈరోజే తుది గడువు కావటంతో వీరిద్దరూ నేడే నామినేషన్లు దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. రాయ్‌బరేలీ నుంచి దినేశ్ ప్రతాప్ సింగ్‌ను భాజపా బరిలోకి దింపింది. ఆయన 2019లో సోనియా చేతిలో ఓటమిపాలయ్యారు. మరోవైపు అమేఠీ నుంచి భాజపా నాయకురాలు స్మృతి ఇరానీ ఇప్పటికే నామినేషన్ వేశారు. మే 20న ఈ రెండు నియోజకవర్గాలకు ఎన్నికలు జరగనున్నాయి. అమేఠీ నుంచి రాహుల్ పోటీ చేస్తారని అంతా భావించారు. కానీ, అనూహ్యంగా ఆయన తన తల్లి సోనియా గాంధీ ఇప్పటి వరకు ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చిన రాయ్‌బరేలీ నుంచి బరిలోకి దిగనుండడం గమనార్హం. ఇక్కడి నుంచి ఆయన సోదరి ప్రియాంక గాంధీ రంగంలోకి దిగుతారని జోరుగా ప్రచారం సాగింది. దీంతో గతకొన్ని రోజులుగా పార్టీతో పాటు రాజకీయ వర్గాల్లో ఈ అంశం చర్చకు దారితీసింది. అమేఠీలో కేంద్రమంత్రి స్మృతి ఇరానీ చేతిలో 2019లో రాహుల్ ఓటమిపాలైన విషయం తెలిసిందే. 2004 నుంచి 2009 వరకు ఆయన ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. అంతకుముందు 1999లో సోనియా గాంధీ ఇక్కడి నుంచి పోటీ చేసి గెలిచారు. 1981 నుంచి 1991 వరకు రాజీవ్ గాంధీ ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం వయనాడ్ సిట్టింగ్ ఎంపీ అయిన రాహుల్ అక్కడి నుంచి మరోసారి పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. రాయ్‌బరేలీ కాంగ్రెస్ కంచుకోటగా కొనసాగుతోంది. 1951 నుంచి ఈ నియోజకవర్గంలో కేవలం మూడుసార్లు మాత్రమే పార్టీ అభ్యర్థులు ఓడిపోయారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఇక్కడి నుంచి మూడుసార్లు గెలుపొందారు. ఆమె భర్త, కాంగ్రెస్ నాయకుడు ఫిరోజ్ గాంధీ రెండుసార్లు విజయం సాధించారు. 1962, 1999 ఎన్నికల్లో మాత్రమే ఈ నియోజకవర్గం నుంచి నెహ్రూ-గాంధీ కుటుంబ సభ్యులు పోటీ చేయలేదు.

**ఎవరీ కిశోరీ లాల్ శర్మ..**

కేఎల్ శర్మగా పార్టీ వర్గాల్లో సుపరిచితులైన కిశోరీ లాల్.. గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు. నాలుగు దశాబ్దాలుగా వారితో అనుబంధం కొనసాగుతోంది. పంజాబ్‌లోని లుధియానాకు చెందిన ఆయన 1983లో రాజీవ్ గాంధీతో కలిసి అమేఠీ, రాయ్‌బరేలీలోకి అడుగుపెట్టారు. 1991లో రాజీవ్ మరణం తర్వాత గాంధీ కుటుంబంతో ఆయన బంధం మరింత బలపడింది. గాంధీలు దిల్లీలో ఉన్న సమయంలో వారి తరఫున ఈ రెండు నియోజకవర్గాల్లో కార్యక్రమాలను చక్కబెట్టేవారు. సోనియా గాంధీ ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించిన సమయంలో కేఎల్ శర్మనే అమేఠీలో అన్నీ చూసుకున్నట్లు పార్టీ వర్గాలు చెబుతుంటాయి.



### 50 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చిన

## హైదరాబాద్ మెట్రో



అనతికాలంలోనే అనూహ్యమైన ఆదరణ పొందిన హైదరాబాద్ మెట్రో.. మరో మైలురాయిని చేరుకున్నది. ఏకంగా ఇప్పటివరకు 50 కోట్ల మందిని గమ్యస్థానాలకు చేర్చి.. చరిత్రను లిఖించుకున్నది. దేశంలోనే మూడో అతి పొడవైన మెట్రో వ్యవస్థగా గుర్తింపు పొందిన హెచ్ఎంఆర్ఎల్.. నగరవాసుల మనస్సును చూరగొంటున్నది. అన్ని మార్గాలు అందుబాటులోకి వచ్చిన అనతి కాలంలోనే మెట్రోకు అనూహ్యమైన స్పందన లభించింది. మియాపూర్-అమీర్‌పేట మార్గంలో 11 కిలోమీటర్ల మెట్రో రైలు సేవలను 2017లో తీసుకురాగా, అప్పటి నుంచి దశల వారీగా సర్వీసులను పెంచుతున్నారు. ఎల్బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గ్ మార్గాల్లో దాదాపు 68 కిలోమీటర్ల పొడవైన లైన్లు అందుబాటులోకి తెచ్చారు.

## నోట్ల కట్టల కంటైనర్‌తో 'కుబేర'..




**ఆసక్తి రేకెత్తేలా నాగార్జున ఫస్ట్‌లుక్**

'కుబేర' అనే పేరుకి తగ్గట్టుగా, కంటైనర్ నిండా నోట్ల కట్టలు. దాని ఎదురుగా వర్షంలో గొడుగుతో నాగార్జున. ఫస్ట్‌లుక్‌లోనే సినిమాపై, అందులోని నాగార్జున పాత్రపై ఆసక్తి రేకెత్తేలా చేశారు దర్శకుడు శేఖర్ కమ్ముల. ఈ లుక్‌లో నాగ్ స్టైలిష్‌గా, కాస్త ఏజ్డ్‌గా కనిపిస్తున్నారు. 'కుబేర' అన్న టైటిల్‌కి సరిగ్గా సరిపోయేలా ఉంది నాగ్ స్టిల్. ధనుష్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో నాగార్జునది ప్రత్యేక పాత్ర అని గతంలో వార్తలొచ్చాయి. కానీ ఈ ఫస్ట్‌లుక్ చూస్తుంటే టైటిల్‌రోల్ నాగార్జునే చేసినట్టు అనిపిస్తున్నది. ఏదేమైనా నాగార్జున లుక్ మాత్రం ఆయన అభిమానులు మెచ్చేలా ఉందని చెప్పక తప్పదు.

## రాశి హాట్ స్టన్నింగ్ ఫోజులు

రాశి ఖన్నా తాజాగా తన గ్లామరస్ లుక్ పోస్ట్ చేసింది. మినీ డ్రెస్ లో రాశి ఖన్నా ఇస్తున్న ఫోజులు యువతని ఆకర్షించే విధంగా ఉన్నాయి.రాశి ఖన్నా టాలీవుడ్ లో బ్యూటీ ఏంజిల్. ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో ఈ యంగ్ బ్యూటీ నటించింది. ఊహలు గుసగుసలాడే చిత్రంతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన రాశి యువతలో మంచి క్రేజ్ తెచ్చుకుంది. కానీ ఇటీవల రాశి ఖన్నాకి అంతగా కలసి రావడం లేదు. ఆమె నటించిన చిత్రాలు డిజాస్టర్ అవుతున్నాయి. ఇప్పటి ట్రెండ్ కు తగ్గట్లుగా నటించడం.. అందంతో మెప్పించడంతో రాశి క్రేజ్ బాగా పెరిగింది. బెంగాల్ టైగర్, సుప్రీం, తొలిప్రేమ, ప్రతిరోజు పండగే లాంటి హిట్ మూవీస్ రాశి ఖన్నా ఖాతాలో ఉన్నాయి. తాజాగా రాశి ఖన్నా కళ్ళు చెదిరే అందమైన డ్రెస్ లో మెరుపులు మెరిపించింది. రాశి ఖన్నా, తమన్నా కలసి బాక్ అనే చిత్రంలో నటించారు. ఈ చిత్రం మే 3న రిలీజ్ కి రెడీ అవుతోంది. ఈ సందర్భంగా రాశి ఖన్నా ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉంది. రాశి ఖన్నా తాజాగా తన గ్లామరస్ లుక్ పోస్ట్ చేసింది. మినీ డ్రెస్ లో రాశి ఖన్నా ఇస్తున్న ఫోజులు యువతని ఆకర్షించే విధంగా ఉన్నాయి.తన గ్లామర్ తో చేతబడి చేస్తున్నా అంటూ రాశి ఖన్నా ఈ ఫోటోలకు కామెంట్ పెట్టింది.




## నేడు ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం

ప్రతి సంవత్సరం మే 3న ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం జరుపుకుంటారు. ప్రపంచవ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు, పత్రికా స్వేచ్ఛపై అవగాహన కల్పించటానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. ఐక్యరాజ్యసమితి 1993లో మే-3 వ తేదీ నుంచి మీడియా స్వేచ్ఛ గురించి చాలా రకాల కార్యక్రమాలు చేస్తూ వస్తోంది. పత్రికా స్వేచ్ఛ పట్ల నిబద్ధతను గౌరవించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలకు ఈరోజు గుర్తు చేస్తుంది.




## అమెరికా వెళ్లే విద్యార్థులకు త్వరలో వీసా స్లాట్లు

విద్యార్థి వీసా ఇంటర్వ్యూ స్లాట్లు విడుదల చేసేందుకు అమెరికా ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. దశలవారీగా విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు స్లాట్లు ఈ నెల రెండోవారం నుంచి ఆగస్టు రెండోవారం వరకు అందుబాటులోకి రానున్నాయి. అమెరికాలో ఫాల్ సీజన్‌కు సంబంధించిన సెమిస్టర్ ఆగస్టు- సెప్టెంబర్ మధ్య ప్రారంభంకానుంది.



## భానుడి ప్రతాపం.. వడదెబ్బతో నలుగురు మృతి

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. నిన్న ఏకంగా 8 జిల్లాల్లో 46 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదైంది. నల్గొండ జిల్లా ఇబ్రహీంపేటలో అత్యధికంగా 46.6 డిగ్రీల టెంపరేచర్ నమోదైంది. ఎండ వేడికి తాళలేక నిన్న ఒక్కరోజే నలుగురు మృత్యు వాత పడ్డారు. మెదక్ జిల్లాలో కుమ్మరి శాకయ్య, ఆసిఫాబాద్లో పోర్తెటి శ్రీనివాస్, కరీంనగర్ లో గజ్జెల సంజీవ్, హనుమకొండలో అల్లె గోవర్ధన్ వడదెబ్బకు గురై ప్రాణాలు విడిచారు.

**పెన్షన్ పంపిణీ.. వడదెబ్బ తగిలి నలుగురు మృతి**

ఏపీలో పెన్షన్ పంపిణీ మూడో రోజు కొనసాగుతోంది. ఇప్పటికే పలువురు వృద్ధులు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. ఇనాక్టివ్ ఖాతాలను యాక్టివ్ చేసుకోవడానికి బ్యాంకులకు వెళ్తున్నారు. బ్యాంకు ఖాతాకు ఆధార్, ఫోన్ నంబర్ లింక్ సమస్యతో పెన్షన్ దారులు ఇబ్బందులు పడుతున్నారు. మండుటెండలో పెన్షన్ కోసం వెళ్లి నలుగురు వృద్ధులు మృతి చెందారు.



## పెరిగిన మహీంద్రా వాహన అమ్మకాలు

2024 ఏప్రిల్ లో మహీంద్రా మొత్తం(హోల్ సేల్) అమ్మకాలు 13% పెరిగి 70,471 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదే కాలంలో మొత్తం అమ్మకాలు 62,294 యూనిట్లు. ఈ ఏడాది ఏప్రిల్ లో ప్రయాణికుల వాహన అమ్మకాలు 18%పెరిగి 41,008 యూనిట్లకు చేరుకున్నాయి. గతేడాది ఇదేకాలంలో ఈ అమ్మకాలు 34,698 యూనిట్లు. మొత్తం ఎగుమతులు గత నెలలో 1,813 యూనిట్ల నుంచి 2% పెరిగి 1,857 యూనిట్లకు చేరుకున్నాయి.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# ప్రసన్నవదనం రివ్యూ

కొన్నేళ్లుగా కొత్త కథలకి కేరాఫ్‌గా నిలుస్తున్న కథానాయకుడు సుహాస్. 'కలర్ ఫొటో' నుంచీ ఆయనది అదే పంథానే. పక్కింటి అబ్బాయిని గుర్తు చేసే పాత్రలు... మనవైన మట్టి కథలతో తెరపై సందడి చేస్తూ విజయాల్ని అందుకుంటున్నారు. 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' తర్వాత ఆయన 'ప్రసన్న వదనం' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. మంచి ప్రచారంతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం ఎలా ఉంది?

కథేంటంటే: సూర్య (సుహాస్) రేడియో జాకీగా పనిచేస్తుంటాడు. ఒక ప్రమాదం అతని జీవితాన్ని తలకిందులు చేస్తుంది. అమ్మానాన్నల్ని కోల్పోవడంతోపాటు... ఫేస్ బ్లైండ్ నెస్ (ప్రోసోపాగ్నోసియా) అనే సమస్య బారిన పడతాడు. ఫేస్ బ్లైండ్‌నెస్‌తో ఎవరి మొహాల్నీ గుర్తు పట్టలేడు, వాయిస్‌నీ గుర్తించలేడు. తన స్నేహితుడు విఘ్నేష్ (వైవా హర్ష)కి తప్ప తన సమస్య ఎవరికీ తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటూ కాలం గడుపుతుంటాడు. ఆద్య (పాయల్)తో ప్రేమలో కూడా పడతాడు. ఇంతలోనే తన కళ్ల ముందు ఓ హత్య జరుగుతుంది. తనకున్న సమస్యతో ఆ హత్య ఎవరు చేశారో తెలుసుకోలేడు. కానీ, పోలీసులకి ఈ విషయం తెలియాలని ప్రయత్నిస్తాడు. ఆ వెంటనే అతనిపై దాడి జరుగుతుంది. అయినా వెనకడుగు వేయని సూర్య.. ఏసీపీ వైదేహి (రాశిసింగ్) దగ్గరికి వెళ్లి జరిగిన విషయం చెబుతాడు. తనకున్న సమస్యనీ వివరిస్తాడు. అనూహ్యంగా ఆ హత్య కేసులో సూర్యనే ఇరుక్కోవల్సి వస్తుంది. ఇంతకీ ఆ హత్య ఎవరు చేశారు?హత్యకి గురైన అమ్మాయి ఎవరు?ఆ కేసులో సూర్యని ఇరికించింది ఎవరు?అసలు నిందితులు ఎప్పుడు ఎలా బయటికొచ్చారు?సుహాస్ ప్రేమకథ ఏ తీరానికి చేరింది? తెలియాలంటే సినిమా చూడాల్సిందే!

ఎలా ఉందంటే: ఏదో ఒక డిజార్డర్‌తో కథానాయకుడి పాత్రకి పరిమితులు విధించి... జీవన్మరణ సమస్య తరహాలో అతని చుట్టూ పలు సవాళ్లని సృష్టించి కథని నడిపించడం చాలా సినిమాల్లో చూసిందే. తనకెదురైన సవాళ్లని అధిగమిస్తూ, తాను అనుకున్న పనిని పూర్తి చేసే క్రమం ఎంత ఆసక్తికరంగా, ఎంత థ్రిల్లింగ్‌గా సాగిందన్నదే సినిమా ఫలితాల్ని ప్రభావితం చేస్తుంది. డిజార్డర్‌తో కూడిన ఈ తరహా కథలు మనకు కొత్త కాకపోయినా, సుహాస్‌ని ఇందులో చూడటం కొత్తగా అనిపిస్తుంది. ఆయనకి ఇప్పటివరకూ ఉన్న లోకల్ ఇమేజ్‌కి, ఆ తరహా పాత్రలకి దూరంగా వెళ్లి చేసిన సినిమా ఇది. ఫేస్ బ్లైండ్‌నెస్ నేపథ్యం కూడా కొత్తగా, గతంలో వచ్చిన డిజార్డర్ సినిమాలకి భిన్నంగా అనిపిస్తుంది. మంచి మలుపులతో ప్రేక్షకులకు థ్రిల్‌ని పంచడంలోనూ దర్శకుడు విజయం సాధించాడు. కథానాయకుడి పాత్ర, దానికున్న సమస్య ప్రేక్షకులకు అర్థమయ్యేలా ఆరంభ సన్నివేశాల్ని మలిచాడు దర్శకుడు. కథానాయకుడికీ, అతని స్నేహితుడికీ మధ్య




సన్నివేశాలు, ఆద్యతో ప్రేమాయణం ఎపిసోడ్‌తో ఆరంభ సన్నివేశాలు సరదా సరదాగా సాగిపోతాయి. కథానాయకుడు హత్య జరగడాన్ని చూడటం నుంచి కథలో ఆసక్తి మొదలవుతుంది. విరామానికి ముందు అనూహ్యంగా కథలో చోటు చేసుకునే మలుపు సినిమాని ఉత్కంఠభరితంగా మార్చేస్తుంది.

ద్వితీయార్థంలో కథానాయకుడి చుట్టూ ఉచ్చు బిగుసుకోవడం, ఎలాగైనా నేరస్తుడు ఎవరనేది కనిపెట్టాలని కంకణం కట్టుకోవడం, ఆ తర్వాత పరిణామాలు, అతను సాగించే పోరాటం, నేరానికి సంబంధించిన ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ద్వితీయార్థంలో కీలకం. హత్య ఎవరు చేశారనేది ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌తో ప్రేక్షకుడికి తెలిసిపోయినా, తనకున్న వ్యాధిని అధిగమించి, అసలు నిజాన్ని కథానాయకుడు ఎలా బయట పెడతాడనేది ఆసక్తికరంగా మారుతుంది. సెకండాఫ్ కీలక సమయాల్లో చోటు చేసుకునే మలుపులు, పతాక సన్నివేశాలు సినిమాని మరింత ఆసక్తికరంగా మార్చేస్తాయి. అక్కడక్కగా సన్నివేశాల్లో వేగం తగ్గినట్టు అనిపించినా, ఓ కొత్త రకమైన థ్రిల్లర్‌ని చూసిన అనుభూతి ప్రేక్షకులకు కలుగుతుంది.

ఎవరెలా చేశారంటే: సూర్య పాత్రలో సుహాస్ నటన ఆకట్టుకుంటుంది. అతడి పాత్ర, కథా నేపథ్యంలో సూర్యగా చూడటం ప్రేక్షకులకు కొత్తగా అనిపిస్తుంది. పాత్ర అవసరమైన చోట హాస్యాన్నీ, భావోద్వేగాల్నీ పంచింది. సుహాస్‌కీ, పాయల్‌కీ మధ్య సన్నివేశాలు సరదా సరదాగా సాగుతాయి. రాశిసింగ్ పోలీస్ అధికారి వైదేహిగా అలరించింది. పాత్రకి తగ్గ ఎంపిక ఆమె. నితిన్ ప్రసన్న పాత్ర సినిమాకి కీలకం. వైవాహర్ష స్నేహితుడిగా అలవాటైన పాత్రలో సందడి చేశాడు. నందు, సాయి శ్వేత పాత్రల పరిధి మేరకు నటించారు. సాంకేతికంగా సినిమాకి ఏ విభాగం లోటు చేయలేదు. థ్రిల్లర్ చిత్రాలకి భిన్నంగా కలర్‌ఫుల్‌గా సినిమా సాగుతుంది. చంద్రశేఖరన్ కెమెరా పనితనం మెప్పిస్తుంది.

# శబరి రివ్యూ

వైవిధ్యభరితమైన పాత్రలు ఎంచుకుంటూ.. విలక్షణమైన నటనతో మెప్పిస్తూ సినీప్రియులకు దగ్గరైన నటి వరలక్ష్మీ శరత్ కుమార్. ఇటీవలే 'హను-మాన్'తో అందర్నీ అలరించిన ఆమె ఇప్పుడు 'శబరి'గా సందడి చేసేందుకు సిద్ధమైంది. ఇది తన తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ముస్తాబైన ఈ సినిమా ప్రచార చిత్రాలతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. మరి ఈ చిత్ర కథేంటి? సినీప్రియుల్ని ఏ మేరకు మెప్పించింది?

కథేంటంటే: సంజన (వరలక్ష్మీ శరత్ కుమార్) సింగిల్ మదర్. చిన్నప్పుడే తల్లి ప్రేమకు దూరమవుతుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న అరవింద్ (గణేశ్ వెంకట్రామన్) ఆమెను మోసం చేయడంతో తన కూతురు రియా (నివేక్ష)ను తీసుకొని ముంబయి నుంచి వైజాగ్‌కు వచ్చేస్తుంది. ఈ క్రమంలో తన కాలేజీ మిత్రుడు, న్యాయవాది అయిన రాహుల్ (శశాంక్)ను కలుస్తుంది. అతని రిఫరెన్స్‌తోనే ఓ కంపెనీలో జుంబా ట్రైనర్‌గా ఉద్యోగం సంపాదిస్తుంది. ఆ తర్వాత వైజాగ్ శివార్లలోని ఓ ఇంట్లో అద్దెకు దిగుతుంది. అయితే అంతా సాఫీగా సాగిపోతుందనుకుంటున్న తరుణంలో సంజనకు ఓ చిత్రమైన సమస్య ఎదురవుతుంది. సైకోగా మారిన సూర్యం (మైమ్ గోపి) అనే వ్యక్తి రియా తన బిడ్డని.. ఆ పాపను తనకు అప్పగించాలని.. లేదంటే చంపేస్తానంటూ ఆమె వెంటపడటం మొదలు పెడతాడు. మరోవైపు అరవింద్ కూడా తన కూతుర్ని తనకు అప్పగించాలంటూ కోర్టు మెట్లు ఎక్కుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది?కూతుర్ని కాపాడుకునేందుకు సంజన ఏం చేసింది?రియా నిజంగా తన కూతురా?కాదా?సైకో సూర్యం నుంచి సంజన ప్రాణానికి వచ్చిన ముప్పేంటి? అతనికి అరవింద్‌కు ఏమైనా




సంబంధం ఉందా?అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.

ఎలా సాగిందంటే: కూతుర్ని కాపాడుకోవడం కోసం ఓ తల్లి చేసిన సాహసోపేతమైన ప్రయాణమే క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. దీన్ని దర్శకుడు ఓ సైకలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా ముస్తాబు చేసే ప్రయత్నం చేశాడు. అయితే కథలోని కొన్ని ట్విస్ట్‌లు థ్రిల్ చేసేలా ఉన్నా.. సినిమాని నడిపించిన తీరు అంతగా మెప్పించదు. స్క్రిప్ట్‌లో సరైన బలం లేకపోవడం.. స్క్రీన్‌ప్లే పేలవంగా ఉండటం.. కథలో సరైన సంఘర్షణ, భావోద్వేగాలు కనిపించకపోవడం ఫలితాన్ని దెబ్బతీసింది. ప్రథమార్థంలో సింహభాగాన్ని పాత్రల పరిచయంతోనే సరిపెట్టాడు దర్శకుడు. సంజన గతం.. తల్లి ప్రేమకు దూరమై చిన్నతనంలో ఆమె పడిన వేదన.. అరవింద్‌ను ప్రేమించి పెళ్లి చేసుకోవడం.. ఆ తర్వాత అతని చేతిలో మోసపోయి ఇంటి నుంచి బయటకు రావడం.. ఈ నేపథ్యమంతా బోరింగ్. అరవింద్ తన కూతుర్ని అప్పగించాలంటూ కోర్టు మెట్లు ఎక్కిన దగ్గర్నుంచే కథ కాస్త వేగం పుంజుకుంటుంది.

ఇక ఎప్పుడైతే సైకో సూర్యం పాత్ర కథలోకి ఎంట్రీ ఇస్తుందో అక్కడి నుంచి అసలు కథ మొదలవుతుంది. తన కూతుర్ని తనకు అప్పగించాలంటూ సంజనను సూర్యం వెంటాడటం.. అతని నుంచి తప్పించుకునే ప్రయత్నంలో ఆమెకు ఎదురయ్యే విషమ పరిస్థితులు అన్నీ థ్రిల్‌కు గురిచేస్తాయి. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ద్వితీయార్థంపై ఆసక్తిరేకెత్తించేలా చేస్తాయి. కానీ, ఆ ఆసక్తి సెకండాఫ్ మొదలైన కాసేపటికే ఆవిరైపోతుంది. సూర్యం పాత్రలో ఉన్న ఓ ట్విస్ట్ థ్రిల్లింగ్‌గా ఉన్నా.. అక్కడి నుంచే సాగే కథనమంతా గాడితప్పిన బండిలా సాగుతుంది. ఆరంభంలో కాస్తోకూస్తో భయపెట్టిన సూర్యం పాత్ర క్లైమాక్స్‌కు వచ్చే సరికి పూర్తిగా తేలిపోయింది. రియా కిడ్నాప్ చుట్టూ నడిచిన డ్రామా ఏమాత్రం ఆసక్తిరేకెత్తించదు. సినిమాని ముగించిన తీరు ఉసూరుమనిపించేలా ఉంటుంది.

ఎవరెలా చేశారంటే: సింగిల్ మదర్‌గా సంజనా పాత్రలో వరలక్ష్మి శరత్ కుమార్ సహజమైన నటనతో ఆకట్టుకుంది. భావోద్వేగభరిత సన్నివేశాల్లో తనదైన నటనతో కట్టిపడేసింది. కథలో బలం లేకున్నా.. సినిమాని తన భుజాలపై మోసే ప్రయత్నం చేసింది. సైకో సూర్యం పాత్రలో మైమ్ గోపి నటన ఆకట్టుకుంటుంది. ఆ పాత్రే సినిమాలో కాస్త థ్రిల్ పంచుతుంది. అరవింద్‌గా గణేశ్ వెంకట్రామన్, రియాగా నివేక్షతో పాటు సినిమాలోని మిగతా పాత్రలన్నీ పరిధి మేరకు ఉంటాయి. అనిల్ ఎంచుకున్న కథలో కొంత కొత్తదనమున్నా.. దాన్ని చక్కటి థ్రిల్లర్‌గా మలచుకోవడంలో తడబడ్డాడు. ముఖ్యంగా స్క్రీన్‌ప్లే చాలా వీక్‌గా అనిపిస్తుంది. ఈ చిత్రానికి శబరి అనే పేరు ఎందుకు పెట్టారో అసలు అర్థం కాదు.

# ఆ ఒక్కటీ అడక్కు రివ్యూ

గణ అలియాస్ గణపతి (అల్లరి నరేష్) సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు ఉద్యోగి. తన కంటే ముందు తమ్ముడు (విరూపాక్ష ఫేమ్ రవికృష్ణ)కి, మేనమామ కూతురు దేవి (జెమీ లివర్)కి పెళ్లి చేస్తాడు. వయసు ఎక్కువ కావడంతో పాటు పెళ్లైన తమ్ముడు ఉండటంతో అతడికి పిల్లను ఇవ్వడానికి అమ్మాయి తల్లిదండ్రులు ఎవరూ ముందుకు రారు. పెళ్లి సంబంధాలు చూడటంలో హాఫ్ సెంచరీ కంప్లీట్ చేస్తాడు. ఆ తర్వాత మ్యాట్రిమోనీ సైట్ ద్వారా పరిచయమైన సిద్ధి (ఫరియా అబ్దుల్లా)తో ప్రేమలో పడతాడు. అయితే... 'నేను మీకు కరెక్ట్ కాదు' అని చెప్పి సున్నితంగా తిరస్కరిస్తుంది ఆ అమ్మాయి. కానీ, ఇద్దరూ స్నేహితులుగా మెలుగుతారు.

మ్యాట్రిమోనీలో తన పేరు నమోదు చేసుకుని అబ్బాయిల దగ్గర డబ్బులు దోచే ఖిలాడీ లేడి సిద్ధి అని వార్తల్లో ఎందుకు వచ్చింది? ఓ మ్యాట్రిమోనీ సంస్థ ప్రజల్ని ఏ విధంగా మోసం చేసింది? పెళ్లి కాని అబ్బాయిలు ఏ విధంగా మోసపోయారు? సిద్ధి ఎవరు? ఆమె నేపథ్యం ఏమిటి? నిజానిజాలు ఏమిటి? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

విశ్లేషణ: ఆ ఒక్కటీ అడక్కు... క్లాసిక్ టైటిల్. ఆ టైటిల్ తీసుకోవడం సాహసం. పైగా, ఆ సినిమా తీసిన ఈవీవీ తనయుడు 'అల్లరి' నరేష్ నయా 'ఆ ఒక్కటీ అడక్కు' సినిమాలో హీరో కావడం, అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ అని చెప్పడంతో అంచనాలు ఏర్పడ్డాయి. ప్రామిసింగ్ ట్రైలర్, పెళ్లి కాని యువకుల కష్టాలు అనే కాన్సెప్ట్ క్యూరియాసిటీ క్రియేట్ చేశాయి. మరి, సినిమా ఎలా ఉంది? అనేది చూస్తే...

ఆ ఒక్కటీ అడక్కు... అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్‌టైనర్ అయితే కాదు! ఆ టైటిల్ తీసుకుని కామెడీ కోటింగ్ ఇస్తూ సీరియస్ సినిమా తీశారు. ప్రస్తుతం చాలా మంది యువతీ యువకులు ఫేస్ చేసే ప్రాబ్లమ్... సరైన పెళ్లి సంబంధం కోసం మ్యాట్రిమోనీ సైట్లను ఆశ్రయించడం! పెళ్లైన అమ్మాయిల నంబర్లను మ్యాట్రిమోనీ సైట్లు అబ్బాయిలకు ఇవ్వడం, మ్యాట్రిమోనీ సైట్లలో యువతీ యువకులకు ఎలాంటి పరిస్థితులు ఎదురు అవుతున్నాయనేది చూపించారు. అయితే... కామెడీ ఒక్కటి తగ్గింది.


పెళ్లి కాని యువకుడిగా అల్లరి నరేష్ ఇంట్రో, మరదలిగా జెమీ లివర్ సన్నివేశాలు సరదా సరదాగా ముందుకు వెళతాయి. డైనింగ్ టేబుల్ దగ్గర వెన్నెల కిశోర్ సీన్ హిలేరియస్‌గా నవ్విస్తుంది. అయితే... ఆ తర్వాత కథలో కామెడీ తగ్గింది. సీరియస్ ఇష్యూ డిస్కషన్ ఎక్కువైంది. అదంతా సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. ఒక స్టేజికి వచ్చాక ఒక్క జోక్ కూడా పేలలేదు.

ఇంటర్వెల్ తర్వాత అయితే నవ్వుకున్న సందర్భాలు వేళ్ల మీద లెక్క పెట్టవచ్చు. తమ్ముడికి ముందు పెళ్లి చేసి తాను ఎందుకు చేసుకోలేదు? అని హీరోయిన్ వేసిన ప్రశ్నకు చూపించిన అల్లరి నరేష్ ఫ్లాష్ బ్యాక్ ఆకట్టుకోలేదు. ఎన్నారై పెళ్లి కొడుకుల మోసాలు, మనం తరచూ వార్తల్లో చూసే విషయాలు తప్ప కొత్తగా ఏమీ లేదు. ఫేక్ పెళ్లి కూతురు కాన్సెప్ట్ కొత్తది. కానీ, దాని చుట్టూ కామెడీ జనరేట్ చేయడంలో 'ఆ ఒక్కటీ అడక్కు' టీమ్ ఫెయిల్ అయ్యింది.

గోపీసుందర్ పాటల్లో 'రాజాది రాజా....' బావుంది. పిక్చరైజేషన్ కూడా బావుంది. కానీ మిగతా పాటలు ఆ స్థాయిలో లేవు. నేపథ్య సంగీతం సోసోగా ఉంది. సాధారణ సీన్లు తీయడానికి గ్రీన్ మ్యాట్ ఎందుకు వాడారో అర్థం కాలేదు. ఆ డిఫరెన్స్ స్క్రీన్ మీద తెలుస్తుంది. అయితే... ప్రొడక్షన్ విషయంలో నిర్మాతలు రాజీ పడలేదని కొన్ని సీన్లు చూస్తే అర్థం అవుతుంది. గణపతి పాత్రలో అల్లరి నరేష్ ఒదిగిపోయారు. క్యారెక్టర్‌కు యాప్ట్ అయ్యారు. అయితే ఆయనకు తగ్గ పంచ్ డైలాగులు, కామెడీ సీన్లు పడలేదు. ఫరియా అబ్దుల్లా నటన ఓకే. హీరో హీరోయిన్ల పెయిర్ బావుంది. పృథ్వీ, గోపరాజు రమణ, ప్రవీణ్, గౌతమి వంటి క్యారెక్టర్ ఆర్టిస్టులను సరిగా వాడుకోలేదు. జెమీ లివర్ ఎక్స్‌ప్రెషన్స్, నటనలో ఆవిడ హుషారు బావుంది. ఫిమేల్ కమెడియన్ లేని లోటు తీరుస్తుందని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. పైన చెప్పినట్టు వెన్నెల కిశోర్ స్క్రీన్ మీద ఉన్నంత సేపూ నవ్వించారు. హర్ష చెముడు సీన్లు సైతం పేలాయి.

ఆ ఒక్కటీ అడక్కు... స్టార్టింగ్ టు ఎండింగ్ కామెడీ ఉంటుందా? అని ప్రేక్షకులు అడక్కూడదు. ఎందుకంటే... సినిమాలో అదొక్కటే తక్కువ. ప్రజెంట్ యూత్, పేరెంట్స్ రిలేట్ అయ్యే కాన్సెప్ట్ ఉంది. సరిగ్గా ప్రజెంట్ చెయ్యడంలో, నవ్వించడంలో యూనిట్ సక్సెస్ కాలేదు. కొన్ని నవ్వుల కోసమే ఈ సినిమా!



## దూత 2లో కామాక్షి భాస్కర్ల

మన తెలుగు ఓటిటి కంటెంట్ లో అక్కినేని నాగచైతన్య మెయిన్ లీడ్ లో దర్శకుడు విక్రమ్ కె కుమార్ తెరకెక్కించిన థ్రిల్లింగ్ హారర్ వెబ్ సిరీస్ "దూత" కూడా ఒకటి. ప్రైమ్ వీడియోలో వచ్చిన ఈ సిరీస్ తెలుగులో అతి పెద్ద హిట్ కావడమే కాకుండా నాగ చైతన్య కి ఓటిటిలో సాలిడ్ డెబ్యూని ఇచ్చింది. అయితే ఈ సిరీస్ కి సీక్వెల్ ని కూడా మేకర్స్ రీసెంట్ గానే కన్ఫర్మ్ చేయగా దీనిపై అందరిలో మంచి ఆసక్తి స్టార్ట్ అయ్యింది. ఇక ఈ సీక్వెల్ సంబంధించి ఇంట్రెస్టింగ్ బజ్ ఇప్పుడు వినిపిస్తుంది. దీని ప్రకారం ప్రస్తుతం టాలీవుడ్ లో మంచి గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ నటి కామాక్షి భాస్కర్ల కీలక పాత్ర పోషించనున్నట్టుగా ఇప్పుడు తెలుస్తుంది. విక్రమ్ కే కుమార్ చిత్రాల్లో కానీ తన నటీనటుల్లో కానీ ప్రతి ఒక్కరికీ ఎంత ఇంపార్టెన్స్ ఉంటుందో అందరికీ తెలుసు. మరి ఈ టాలెంటెడ్ నటి దూత 2 లో ఎలాంటి పాత్రలో షైన్ అవుతుందో చూడాలి. ఇటీవల వచ్చిన థ్రిల్లర్ "పొలిమేర 2" కూడా ఆమె మంచి పెర్ఫామెన్స్ ని కనబరిచిన సంగతి తెలిసిందే. ఇక మరో పక్క చైతు తన "తండేల్" తో బిజీగా ఉన్నాడు.